క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 23, వంకాయ 28, బెండ 23, పచ్చిమిర్చి 40, కాకర 35, బీర 28, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 15, క్యారెట్ 37. దొండ 28, ఆలు 21, ఉల్లి 30, గోకర 28, దోస 28, సొర 11, పొట్ల 18, అరటి 11, చిక్కుడు 45, అర్వి 35, మునగ 28, చిలగడదుంప 40, బీట్‌రూట్ 25, కీర 15, ఫ్రెంచ్ బీన్స్ 50, కాప్సికమ్ 38. ఈ ధరలు శుక్రవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సుధీర్‌రెడ్డికి శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలియజేస్తున్న బ్రహ్మయ్య తదితరులు

నాగోలు: ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ తరపున మరోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం ప్రకటించిన సందర్భంగా ఆయనను గురువారం తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దవూరే బ్రహ్మయ్య ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రజక సంఘం నాయకులు వడినల్ల మడివేల్, పూనం రాములు, నాగిల యాదగిరి, గోవింద్ మల్లేష్, పగడాల లక్ష్మణ్, తిరుపతి, రేణుక, గీత పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



సుభాష్‌రెడ్డిని సన్మానిస్తున్న అజిత్‌రెడ్డి దంపతులు

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి గురువారం ఆపార్టీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డిని నగరంలోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మూసారంబాగ్ మాజీ కార్పొరేటర్ తీగల సునరితరెడ్డితో కలిసి ఎమ్మెల్సీని సన్మానించి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా మిద్దెల జితేందర్



చంపాపేట: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడిగా చంపాపేట రెడ్డి బస్తీకి చెందిన రాష్ట్ర ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ నియమితులయ్యారు. ఈమేరకు గురువారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ జాతీయ సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ లాల్‌జీ దేశాయ్ ఉత్తర్వులు జారీ చేసి జితేందర్‌కు అందజేశారు. ఈయన గతంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శిగా, ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇంచార్జిగా పార్టీకి సేవలు అందించారు. ప్రస్తుతం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

మద్యం మత్తులో వాహనం నడిపిన వ్యక్తి రిమాండ్



కారు దూసుకెళ్లడంతో ధ్వంసమైన షాపు

చాదర్‌ఘాట్: మద్యం మత్తులో వాహనాన్ని నడిపి దివ్యాంగుడిని గాయాల పాల్జేయడమే కాకుండా పలు వాహనాలను ఢీకొట్టి ధ్వంసం చేసిన వ్యక్తిని చాదర్‌ఘాట్ పోలీసులు అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. సీఐ ప్రకాష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... హయత్‌నగర్‌కు చెందిన సివిల్ కాంట్రాక్టర్ రాజ్‌సింగ్ (30) కాచిగూడ నుంచి హయత్‌నగర్‌కు కారులో బయలుదేరాడు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడంతో మలక్‌పేటలోని యశోద హాస్పిటల్ వద్ద రోడ్డు పక్కన ఉన్న చెప్పుల షాపులోకి కారు దూసుకెళ్లింది. అక్కడ ఉన్న దివ్యాంగుడిని కారు ఢీకొనడంతో గాయాలయ్యాయి. షాపు ముందు ఉన్న ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. షాపు యజమాని కారును ఆపేందుకు యత్నించగా తప్పించుకొని కారుతో సహా అక్కడి నుంచి పారిపోయాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా కొత్తపేట పీవీటీ మార్కెట్ వద్ద అదులోకి తీసుకొని చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు రాజ్‌సింగ్‌కు బ్రీతింగ్ టెస్ట్ నిర్వహించగా మద్యం తాగి ఉన్నట్టు తేలింది. దీంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.



గాయపడ్డ వ్యక్తి

అంతటా శ్రావణ శుక్రవారం శోభ





సరూర్‌నగర్ రైతుబజార్‌లో పూలు, పండ్లు, అరటి ఆకులు కొనుగోలు చేస్తున్న జనం

- నేడు వరలక్ష్మీ వత్రాలు జరుపుకునేందుకు ఏర్పాట్లు
- ఆలయాల ముస్తాబు
- పూజాసామగ్రి కొనుగోలుదార్లతో మార్కెట్లలో సందడి

దిల్‌సుఖ్‌నగర్: లక్ష్మీదేవికి ఎంతో ప్రీతిపాత్రమైన నెల శ్రావణ మాసం... వరలక్ష్మీ కటాక్షం కోసం మహిళలు శ్రావణ శుక్రవారాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఈరోజు శ్రావణ మాసం రెండో శుక్రవారం కావడంతో అష్ట ఐశ్వర్యాలు, శాంతి సౌభాగ్యాలు, సిద్ధించేలా వరాలు ఇవ్వాలని కోరుకుంటూ వరలక్ష్మీ వత్రాన్ని ఘనంగా జరుపుకోనున్నారు. ఈనేపథ్యంలో మలక్‌పేటజోన్ పరిధిలోని అమ్మవారి ఆలయాలను ఆలయ నిర్వాహకులు పూలమాలలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

- జోన్ పరిధిలోని ఆర్‌కేపురం డివిజన్ వాసవికాలనీలోని శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి ఆలయం, శ్రీసరస్వతి ఆలయంతో పాటు దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీసంతోషిమాత ఆలయం, శ్రీదుర్గాదేవి దేవాలయం, సైదాబాద్‌లోని శ్రీవిజయదుర్గాదేవి, జయదుర్గాదేవి అమ్మవారి ఆలయం, మలక్‌పేట్‌లోని శ్రీఅండాళ్ నిలయం, మాదన్నపేటలోని దుర్గాదేవి ఆలయం, అక్బర్‌బాగ్, ఐఎస్ సదన్, సరూర్‌నగర్ మండలంలోని గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం శ్రావణమాస వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా జరుపుకోనున్నారు.

పెరిగిన పూలు, పండ్ల ధరలు

శ్రావణ శుక్రవారం నేపథ్యంలో వరలక్ష్మీ వ్రతం పూజాసామగ్రి, పూలు, పండ్ల ధరలను వ్యాపారులు అమాంతంగా పెంచేశారు. బంతి కిలో రూ.100 నుంచి 130, చామంతి కిలో రూ.300 నుంచి రూ.350 వరకు, గులాబీ రూ. 250 నుంచి రూ.300కు పెంచేశారు. పెరిగిన ధరలతో వినియోగదారులు కొంత అసంతృప్తిని వ్యక్తం చేశారు. పర్వదినాలనలో ధరలు పెరగకుండా నియంత్రించాలని వినియోగదారులు కోరుతున్నారు.



శ్రావణ శుక్రవారం వేడుకలకు ముస్తాబైన ఆర్‌కేపురంలోని అష్టలక్ష్మీ ఆలయం

ఎక్కడా లేని విధంగా ఎల్బీనగర్‌లో పార్కులున్నాయి

ఎల్బీనగర్: దేశంలో ఎక్కడా లేని విధంగా ఎల్బీనగర్ నియోజకవర్గంలో పార్కులు ఉన్నాయని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సచివాలయనగర్ హెచ్‌ఎండీఏ పార్కును గురువారం అధికారులు, వాకర్స్‌తో కలిసి మార్నింగ్ వాక్‌లో భాగంగా పరిశీలించారు. పార్కు అభివృద్ధికి కృషి చేసిన అధికారులను ఆయన అభినందించారు. పార్కులో చిన్నపిల్లలు ఆడుకోవడానికి వసతులు కల్పించాలని, పార్కు వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలతో నిండిపోయిందని కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టి తీసుకొచ్చారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, చిన్న పిల్లల కోసం అన్ని రకాల వసతులు కల్పించడంతో పాటు ఖాళీ స్థలంలో శుభ్రం చేయించి యోగా షెడ్ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అరవింద్‌రెడ్డి, నాయకులు అనిల్‌చౌదరి, శ్రీధర్‌గౌడ్, బుచ్చిరెడ్డి, రాంబాబు, శ్రీనివాస్, శివశంకర్, రాఘవేంద్రరావు, అధికారులు జీహెచ్‌ఎంసీ డీఈ దామోదర్, హెచ్‌ఎండీఏ ఏఈ జీవన్, హార్టికల్చర్ ఏఈ మేధ పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ అడ్డా: మల్‌రెడ్డి



గాంధీభవన్‌లో టికెట్ కోసం దరఖాస్తు అందజేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అడ్డా అని ఆపార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. గురువారం ఉదయం మల్‌రెడ్డి దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం చైతన్యపురిలోని పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలతో వాహనాలతో భారీ ర్యాలీగా గాంధీభవన్ చేరుకున్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో కేసీఆర్ పాలనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుర్రం శ్రీనివాసరెడ్డి, బద్దుల వెంకటేశ్‌యాదవ్, పార్టీ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, బీఎన్‌రెడ్డి అధ్యక్షుడు సదాశివుడు, గడ్డిఅన్నారం అధ్యక్షుడు బద్దుల వేణుయాదవ్, కొత్తపేట అధ్యక్షుడు కిషోర్‌గౌడ్, నాగోల్ అధ్యక్షురాలు మంజులారెడ్డి, వనస్థలిపురం అధ్యక్షుడు నర్సింహయాదవ్, హస్తినాపురం అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, లింగోజిగూడ అధ్యక్షుడు శ్రీనివాస్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు స్వర్ణ మాధవి తదితరులు పాల్గొన్నారు.

కాషాయ జెండా ఎగురవేయటం ఖాయం: వంగ

చంపాపేట: వచ్చే శాసన సభ ఎన్నికల్లో ఎల్‌బీనగర్ నుంచి బీజేపీ అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపించి కాషాయ జెండా ఎగురవేయటం ఖాయమని చంపాపేట డివిజన్ కార్పొరేటర్, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడు వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ పార్టీ కార్యాలయంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ...బీజేపీకి కార్యకర్తలే ఊపిరని, వారు అలుపెరగని సైనికుల్లా పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని సూచించారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజావ్యతిరేక విధానాలు, వైఫల్యాలే బీజేపీ అభ్యర్థి విజయానికి దోహద పడుతాయన్నారు. కార్యక్రమంలో కర్ణాటక ఎమ్మెల్సీ రవికుమార్, ఎల్‌బినగర్ బీజేపీ కన్వీనర్, కొత్త రవీందర్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు కటికం నర్సింహారావు, సందీప్‌రెడ్డి, సుంకరి రమేష్‌గౌడ్, అవినాష్‌రెడ్డి, శ్రీనివాస్, బూత్ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో రాచరికపు పాలన సాగుతోంది'



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఈటల రాజేందర్

లింగోజిగూడ: రాష్ట్రంలో రాచరికపు పాలన సాగుతోందని, బుడుగు బలహీన వర్గాల జీవించలేని పరిస్థితి ఏర్పడిందని మాజీ మంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు. తమను పర్మనెంట్ చేయాలని వారం రోజులుగా ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల కార్యాలయం ఆవరణలో ఆందోళన చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను గురువారం ఆయన కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ, చాలీచాలని జీతాలతో కార్మికులు తమ ఇంటిని నెట్టుకొస్తున్నారని, పిల్లలకు మంచి విద్యను అందించలేక పోతున్నారని అన్నారు. ప్రభుత్వ భూములను వందల కోట్లకు విక్రయిస్తున్న ఈ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు.పేదలనుకొట్టి పెద్దలకు పెడుతున్నారని, ఎక్కడా కూడా బడుగు బలహీన వర్గాల వారు సంతోషంగా లేరని అన్నారు. కార్మికులను, ఉద్యోగులను విధుల నుంచి తొలగించడం కాదు, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు తొలగించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని రాజేందర్ అన్నారు. కార్మికులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని, వారి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతు



కమలానగర్ వెలుగుతున్న వీధి దీపాలు

సాక్షి ఎఫెక్ట్..

హస్తినాపురం: సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తకు స్పందించిన జీహెచ్‌ఎంసీ విద్యుత్ అధికారులు వీధి దీపాలకు మరమ్మతు చేపట్టారు. వనస్థలిపురం పరిధిలోని కమలానగర్ కాలనీలో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదని, వాటికి మరమ్మతు చేపట్టాలని ఈనెల 12న సాక్షి వార్తను ప్రచురించింది. స్పందించి అధికారులు కాలనీలో వీధి దీపాలను బాగు చేశారు.



జీఎస్ఐలో స్టాఫ్ వాక్‌ను ప్రారంభిస్తున్న ఏడీజీ వెంకటేశ్వర్‌రావు

ప్రతి రోజూ వాకింగ్ చేయాలి

మన్సూరాబాద్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ)లో జాతీయ క్రీడా వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 21న ప్రారంభమై ఉత్సవాలు 29 వరకు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా గురువారం జీఎస్ఐలోని కాంప్లెక్స్ నుంచి ప్రధాన గేట్ వరకు స్టాఫ్ వాక్ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జీఎస్ఐ అడిషనల్ డైరెక్టర్ జనరల్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ సీహెచ్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ, ఉద్యోగులు ప్రతి రోజూ 30 నిమిషాల పాటు తప్పని సరిగా వాకింగ్ చేయాలన్నారు. అధికారులు ఎంఎల్ దొర, ఎస్‌కే నాయక్, తారకేశ్వర్ రావు, ఉద్యోగుల సంఘం నాయకులు మధిర సత్యనారాయణ, చక్రేశ్వర్, చంద్రయ్య, మ్యాథ్యూస్, అనిల్‌కుమార్, అయూబ్‌ఖాన్, సురేష్ పాల్గొన్నారు.

ఆందోళన విరమించి విధులకు హాజరవ్వండి: ఎమ్మెల్యే



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: అడగకుండానే కార్మికుల వేతనాలను పెంచడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌ది అని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. పర్మనెంట్ చేయాలని ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల కార్యాలయ ఆవరణలో ఆందోళన చేస్తున్న జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వద్దకు గురువారం ఆయన వచ్చారు. కార్మికుల నుద్దేశించి ఆయన మాట్లాడారు. తప్పకుండా కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని తెలిపారు.ఆందోళన విరమించి విధుల్లో చేరాలని కార్మికులను ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్, రమేష్ ముదిరాజ్, ఆనంద్‌గౌడ్, బాల కిషన్, శ్రీశైలం యాదవ్, రమణారెడ్డి, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రిని కలిసిన యాకుత్‌పురా బీఆర్ఎస్ అభ్యర్థి

సైదాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో తనకు రెండోసారి అవకాశమిచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్, హోంమంత్రి మహమూద్‌అలీకి యాకుత్‌పురా నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని కార్యాలయంలో ఆయన హోంమంత్రి మహమూద్ అలీ, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి శాలువా కప్పి, పూల మొక్క బహూకరించి ధన్యవాదాలు తెలిపారు. ఐఎస్‌సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నారెడ్డి పాల్గొన్నారు.



హోంమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్న సామ సుందర్‌రెడ్డి

నియంతృత్వ పోకడలకు ఎమ్మెల్యే స్వస్తి చెప్పాలి: వంగ



మధుసూదన్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

చంపాపేట: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్థానిక కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వకుండా ప్రొటోకాల్‌ను తుంగలో తొక్కి నియంతలా తన అనుచరులతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారని చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. ఈ విధానానికి ఎమ్మెల్యే స్వస్తి చెప్పకపోతే పర్యవసానం అనుభవించక తప్పదని హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని శుభోదయ, ఎస్వీ, దుర్గాభవానీనగర్ కాలనీలో బుధవారం సుధీర్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయగా, అవే పనులకు గురువారం సాయంత్రం మరోమారు మధుసూదన్‌రెడ్డి శంకుస్థాపన చేసేందుకు యత్నిస్తుండగా పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకుని కంచన్‌బాగ్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వంగ మాట్లాడుతూ... జీహెచ్‌ఎంసీ నిధులతో ప్రారంభించే అభివృద్ధి పనులను సుధీర్‌రెడ్డి తానే మంజూరు చేయించానని గొప్పలు చెప్పుకుని హంగూ ఆర్భాటాలతో శంకుస్థాపనలు చేయటం సిగ్గు చేటన్నారు. అరెస్టయిన వారిలో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, బీజేపీ నాయకులు అవినాష్‌రెడ్డి, సుంకరి రమేష్‌గౌడ్, శ్రీనివాస్, వేణు ఉన్నారు.

ఆన్‌లైన్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

హస్తినాపురం: ఆన్‌లైన్ మోసాలకు పాల్పడే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్‌లో మోసపోయిన వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇస్తే తగిన సాయం అందజేస్తామని వనస్థలిపురం సీఐ దేప జలేంధర్‌రెడ్డి అన్నారు. గురువారం వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆన్‌లైన్‌లో డబ్బులు పోగొట్టుకున్న దివాకర్‌గౌడ్‌కు రూ.11 వేలు, సురోజిత్ ముఖర్జీ రూ.9,500, జి.నరేశ్‌కు రూ.9,300లు డీడీ రూపంలో సీఐ అందజేశారు. సీఐ మాట్లాడుతూ, ఆన్‌లైన్‌లో డబ్బులు పోగొట్టుకున్న వారు సకాలంలో స్పందించి ఫిర్యాదు చేయడంతో తాము ఆన్‌లైన్ లావాదేవీలు జరిగిన ఖాతాలను ఫ్రీజ్ చేసి డబ్బులను రాబట్టి పోగొట్టుకున్న వారికి తిరిగి ఇప్పించామన్నారు. ఎస్‌ఐలు జగన్, నర్సింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా వైఆర్‌పీ ఫౌండేషన్

దిల్‌సుఖ్‌నగర్: ప్రతిభ కలిగి ఆర్థిక ఇబ్బందులతో విద్యార్థులు ఎవ్వరూ విద్యకు దూరం కాకూడదన్న మహోన్నత లక్ష్యంతో వైఆర్‌పీ ఫౌండేషన్ ఏర్పాటు చేశామని ఫౌండేషన్ చైర్మన్ యేలిశాల రవిప్రసాద్ తెలిపారు. గురువారం ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలో ఏర్పాటు చేసిన ఫౌండేషన్ శాశ్వత కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఇంటర్మీడియట్, ఇంజినీరింగ్‌తో పాటు ఉన్నత విద్యాభ్యాసం కోసం ఫీజులు చెల్లించేందుకు ఆర్థిక సాయం చేస్తామన్నారు. చైతన్యపురి కార్పొరేటర్ రంగ నరసింహగుప్తా, మెర్శెట్టి శ్రీనివాస్‌గుప్తా, టి. నరసింహారావు, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, చకిలం శేషగిరిరావు పాల్గొన్నారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నాగోలు: చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభించిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం సాయంత్రం బండ్లగూడ చెరువులో గుర్తుతెలియని మృతదేహం తేలియాడుతుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 30- 35 సంవత్సరాల మధ్య ఉంటుందని, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీసీబంధు చెక్కుల పంపిణీ



పహాడీషరీఫ్: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారని జల్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు యంజాల జనార్దన్ అన్నారు. బీసీ బంధు చెక్కులను జల్‌పల్లి గ్రామానికి చెందిన మల్లేష్, మౌనికలకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ, దళిత, మైనార్టీ బంధులతో ఆయా వర్గాల ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందన తెలిపారు. మంత్రి సబితారెడ్డి ఆదేశాలతో అధికారులు నిజమైన పేదలను బీసీ బంధులో ఎంపిక చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు సయీద్ పటేల్, పోలెమోని నగేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఉరేసుకుని గృహిణి ఆత్మహత్య

హయత్‌నగర్: భర్త ప్రవర్తనతో విసుగు చెందిన గృహిణి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం రాత్రి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...హయత్‌నగర్ ప్రగతినగర్ కాలనీకి చెందిన గూడూరు రజిని(42) భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటోంది. కుమారుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా, కుమార్తె 9వ తరగతి చదువుతోంది. మద్యానికి బానిసైన భర్త కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. అతనిలో మార్పు రాపోవడంతో మనస్తాపానికి గురైన రజిని బుధవారం సాయంత్రం ఇంట్లో చీరతో ఉరేసుకుని మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు: ఈటల



మాట్లాడుతున్న బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్

మన్సూరాబాద్: 14 ఏళ్ల పాటు ఉద్యమం చేసి 12 వందల మంది యువకుల బలిదానాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని మాజీ మంత్రి, బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ విమర్శించారు. బాలికపై ఆత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, బెల్టుషాపులు, గంజాయి, డ్రగ్స్ రహిత ఎల్‌బీనగర్ కావాలని డిమాండ్ చేస్తూ ఎల్‌బీనగర్‌లోని బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి 48 గంటల నిరసన దీక్ష చేపట్టారు. 2వ రోజు దీక్ష శిబిరాన్ని ఈటల, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ చౌరస్తాకు ఒక చరిత్ర ఉందని, మలిదశ తెలంగాణ ఉద్యమంలో శ్రీకాంత్‌చారి తెలంగాణ కోసం బలిదానం అయ్యాడని, అలాంటి ప్రాంతంలో మహిళల రక్షణ కోసం టెంట్ వేసుకుని నిరసన దీక్షలు చేస్తామని ఊహించలేదని, పాలకుల అసమర్థతకు ఇది నిదర్శనమన్నారు. సామ రంగారెడ్డి మహిళల పక్షాన దీక్ష చేపట్టడం అభినందనీయమన్నారు. నందనవనంలో బాలికపై అత్యాచారం చేసిన నిందితులపై కేసు నమోదు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, దళితులకు 3 ఎకరాల భూమి వంటి ఎన్నికల హామీలు ఏమయ్యాయని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వానికి పేదలకు రేషన్ కార్డులు ఇచ్చే దమ్ములేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో కర్ణాటక ఎమ్మెల్సీ రవికుమార్, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, పవన్‌కుమార్, ఆకుల శ్రీవాణి, వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు కృష్ణవేణి, విజయ్‌కుమార్, నాంపల్లి రామేశ్వర్, ఎలే పురేందర్, కృష్ణంరాజు, రవిశంకర్, కృష్ణారెడ్డి, మన్నెం అరుణ పాల్గొన్నారు.